క్లుప్తంగా

భోగేశ్వరుడి భూముల కౌలుకు 29న వేలం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయ భూములను కౌలు పద్ధతిలో సాగు చేసుకునేందుకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను 58.85 ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీన ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ చెప్పారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

రేమట ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

కర్నూలు (న్యూటౌన్): రేమట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ఖాశీమన్న విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2009 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన ఉపాధి హామీ పథకంలో తక్కువ మంది వేజ్ సీకర్స్‌తో పనులు చేయిస్తున్నారని, పర్యవేక్షణ సరిగా చేయడం లేదని, విధులకు గైర్హాజరు కావడం, ముఖ్యంగా ఉన్నతాధికారుల మీటింగ్‌లకు హాజరు కాకపోవడం, మస్టర్‌లో హాజరు సరిగా వేయకపోవడం, పనుల్లో పురోగతి లేకపోవడం, శ్రమశక్తి మేటీలతో రోజ్‌గార్ దివాస్ మీటింగ్‌లు పెట్టకపోవడం వంటి కారణాలతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో విజయ డెయిరీ విధ్వంసం

పాణ్యం: గతంలో టీడీపీ ప్రభుత్వం విజయ డెయిరీని నాశనం చేసిందని డైరెక్టర్ సరళమ్మ ఆరోపించారు. నంద్యాల పర్యటనలో లోకేశ్ విజయ డెయిరీపై చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డెయిరీలో పాడి రైతులకు బోనస్ ఇవ్వలేదని నాయకులే స్వాహా చేశారని ఆరోపించారు. కొత్తగా ఎన్నికైన చెర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి డెయిరీని లాభాలబాట పట్టించి పాడి రైతులకు బోనస్ ఇచ్చారని, ప్రతిఫలం ఆశించకుండా పని చేసి అనతి కాలంలోనే డెయిరీని అభివృద్ధి చేశారన్నారు. డెయిరీ అభివృద్ధిని చూసి ఓర్వలేక లోకేశ్ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. మరో మారు మాట్లాడితే సహించబోమన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించండి



పులకుర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని పులకుర్తి, కల్లపరి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఏపీఓ రమాదేవితో కలిసి పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండుతున్న ఎండల దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి రావాలని, నిర్దేశిత కొలతల మేర పని చేస్తే రోజుకు రూ.270 వేతనం పడుతుందన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓకు సూచించారు. అనంతరం కల్లపరి, పులకుర్తి గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఓర్వకల్లు: లొద్దిపల్లె గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సవారి ఎల్లశేఖర్ (21) కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేవాడు. వైద్యుల వద్ద చూపించినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 10న సాయంత్రం 5.30 గంటల సమయంలో నన్నూరు సమీపంలో ఉన్న వెంచర్‌లో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి అమీలియో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

'వలంటీర్లకు వందనం' కార్యక్రమం

కర్నూలు (న్యూటౌన్): వలంటీర్ల సేవలకు గుర్తుగా ఈ నెల 20వ తేదీ నుంచి కర్నూలు మండలంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించనున్నారు. కర్నూలు మండల పరిధిలోని 312 మంది వలంటీర్లకు సేవామిత్ర, 5 మంది వలంటీర్లకు సేవారత్న అవార్డులు ఇవ్వనున్నారు. ఈ నెల 20న కర్నూలు మండలం సుంకేసుల, ఆర్ కొంతలపాడు, ఆర్‌కే దుద్యాల, తులశాపురం, జి శింగవరం, ఉల్చాల, రేమట, నిడ్జూరు గ్రామాలకు సంబంధించి ఎదురూరు జెడ్పీ హైస్కూల్‌లో, 29వ తేదీన గొందిపర్ల, దేవమడ, పంచలింగాలకు సంబంధించి ఈ తాండ్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ తర్వాత గార్గేయపురం, పసుపల, పడిదెంపాడు, పి రుద్రవరం, బీ తాండ్రపాడు, దిన్నెదేవరపాడు గ్రామాలకు సంబంధించి నందనపల్లె జెడ్పీ హై స్కూల్‌లో కార్యక్రమం జరగనుంది. ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరుకానున్నారు.

ఎస్సార్బీసీ మరమ్మతులపై దృష్టి

- లీకేజీలను గుర్తించిన అధికారులు
- చివరి ఆయకట్టుకు నీరు అందించేలా చర్యలు

ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌ల కింద సాగయ్యే ఆయకట్టు వివరాలు

బ్లాక్ నంబర్	ఆయకట్టు (ఎకరాల్లో)
1వ బ్లాక్	16,253
2వ బ్లాక్	3,612
3వ బ్లాక్	4,151
4వ బ్లాక్	8,873
5వ బ్లాక్	4,325
6వ బ్లాక్	4,400
7వ బ్లాక్	13,152
8వ బ్లాక్	6,329
9వ బ్లాక్	10,404
10వబ్లాక్	24,446
11వబ్లాక్	4,424
11ఏ బ్లాక్	3,885
మొత్తం	1,04,854



కొణిదేడు వద్ద దెబ్బతిన్న ప్రధాన కాల్వ.



తాటికాయంజనేయ స్వామి వద్ద ప్రధాన కాల్వకు దెబ్బతిన్న లైనింగ్

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు కింద పొలాలకు సమృద్ధిగా నీరు అందించడమే లక్ష్యంగా దెబ్బతిన్న కాల్వలకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం నీటి ప్రవాహం వల్ల ప్రధాన కాల్వతో పాటు, బ్లాక్‌లు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. దీంతో ఎస్సార్బీసీ అధికారులు ఒక్కో బ్లాక్‌కు ఒక్కో డీఈఈ స్థాయి అధికారిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నారు.

ఎస్సార్బీసీ (శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) ఆవిర్భవించినప్పటి నుంచి ఏ ప్రభుత్వం నిర్వహణను పూర్తిగా చేపట్టలేకపోయింది. దీంతో ప్రధాన కాల్వతో, పాటు బ్లాక్ డ్యామేజీ వల్ల నీరు పొలాల్లో చేరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం నీరు–చెట్టు పేరుతో లక్షల రూపాయాలు వృథా చేసింది. కేవలం కాల్వలపై గ్రావెల్ రోడ్లు వేసి బిల్లులు స్వాహా చేశారు. కాల్వలు ఎక్కడ డ్యామేజీ ఉన్నాయి, సిమెంట్ వాల్ ఎక్కడ దెబ్బతిందో పరిశీలించకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించలేకపోయారు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. మొదటిసారిగా ఎస్సార్బీసీని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)కు అప్పగించిన తర్వాత క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను గుర్తిస్తున్నారు. ఇందుకు బ్లాక్‌ల వెంట పర్యటిస్తున్నారు. ఓ వైపు ప్రధాన కాల్వకు కూడా లైనింగ్ దెబ్బతిన్న చోట్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

లక్షల ఎకరాలకు సాగునీరు

ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు సంపూర్ణంగా అందుతున్నాయి. పాణ్యం మండలం గోరుకల్లు నుంచి అవుకు మండలం వరకు 11 బ్లాక్‌లు ఉన్నాయి. అలాగే అవుకు మండలంలో 11ఏ బ్లాక్‌ను కొత్తగా నిర్మించి ఆ బ్లాక్‌కు కూడా నీరందిస్తున్నారు.

గోరుకల్లు నుంచి పాణ్యం, నంద్యాల, గడివేముల, గోస్పాడు, బనగానపల్లె, అవుకు, కొవెలకుంట్ల, సంజామలతో పాటు పలు మండలాలకు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌ల ద్వారా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో నీరు అందిస్తారు. ప్రస్తుతం ఎస్సార్బీసీ ప్రధాన కాల్వతో పాటు, బ్లాక్‌లు బాగు చేసి, ఎక్కడా నీరు వృథా కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేస్తున్నారు.

రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

ఎస్సార్బీసీ కాల్వల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి రూ.3 కోట్లతో ప్రతిపాదలు పంపించాం. కిందస్థాయి సిబ్బంది ద్వారా సమస్యలను గుర్తించాం. ప్రధాన సమస్యలుగా ప్రధాన కాల్వ, బ్లాక్‌కు ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కాల్వలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం.

– మధవరావు, ఈఈ (కాడా)

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

గూడూరు: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎంపీడీఓ మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో 150 ఎకరాలలో పండ్ల తోటల సాగు చేపట్టాలని, ఇందుకు ఆసక్తి కలిగిన సన్న, చిన్నకారు రైతులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. సబ్సిడీపై మొక్కలు, సంరక్షణకు ఆర్థిక సాయం ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. అలాగే మండలంలో ఉపాధి హామీ పథకానికి కూలీల సంఖ్య పెంచాలన్నారు. 4 వేల మంది కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి ఏపీఓలు హసీనా, రామేశ్వరమ్మ, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జోషిలా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు http://apms.ap.gov.in/apms వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 10వ తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయండి



సి.బెళగల్‌లో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. ఆమె శుక్రవారం తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడుతో కలిసి స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల అధికారులు, పొదుపు మహిళలతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాల నిర్వహణపై అధికారులతో చర్చించి, మహిళలకు అవగాహన కల్పించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలు రద్దవుతాయని, ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, పదో తరగతి ఫెయిలైన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రత్యేక తరగతులకు పంపేలా ఎంపీడీఓ కృషి చేయాలని అన్నారు. గృహ నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ సుమంత్, అంగన్‌వాడీ సేవలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, ఉపాధి పనుల కల్పన, ఉద్యాన పంటల సాగుపై ఏపీఓ లక్ష్మన్న, పశు సంరక్షణపై స్థానిక పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్, సైబర్‌క్రైమ్, బాలికలు, మహిళల సంరక్షణపై మహిళా కానిస్టేబుల్ సుజాత, విద్యా శాఖ పనులపై ఎంఈఓ జ్యోతి, ఆరోగ్య కార్యక్రమాలను ఎంపీహెచ్ఓ సుధాకర్, సీహెచ్ఓ ఉమామహేశ్వరి వివరించగా డీడీ పలు సూచనలు చేశారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్ ఆంధ్రను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ పాండురంగన్న, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సృజన, కోశాధికారి పద్మావతి, వైకేపీ సీసీలు నాగేంద్ర, నరసింహుడు, మారెన్న తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణంలో నిర్మిస్తున్న ధర్మపురి క్షేత్ర అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కర్నూలు పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ సంజీవ్‌కుమార్ రూ.5 లక్షలు విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం అద్భుతంగా కొనసాగుతోందన్నారు. ఇందుకు తన వంతుగా విరాళం అందించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి, జీతూరి రవికుమార్, నాగరాజు, రాఘవేంద్ర, మోహన్ తదితరులు ఉన్నారు.

పేదల ద్రోహి చంద్రబాబు



కోడుమూరులో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మతి భ్రమించి మాట్లాడుతున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విమర్శించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా 'మీకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ' చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏనాడు పేద ప్రజల గురించి ఆలోచించింది లేదన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. అమరావతిలో పేదలు ఇళ్లు కట్టుకోవడం ఇష్టం లేకనే చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు ధైర్యముంటే వచ్చే ఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా జగనన్నను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. జడ్పీటీసీలు మౌలాలి, గిరిజోను, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ భీమిరెడ్డి, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం, సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, నాయకులు విజయ్‌యాదవ్, అద్దుగల రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్, బలరాం, మల్లేష్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం: గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల్లో ఉండి, చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహిస్తున్న వారికి ఆర్థికంగా భరోసా కల్గించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చేయూత అందించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం పాణ్యం పొదుపు కార్యాలయంలో జిల్లాలోని డీఆర్‌డీఏ ఏపీఓలు, సీసీలకు సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. ప్రతి మండలం నుంచి 25 మందిని గుర్తించి రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి రూ.2 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మండల ఏపీఎం, సీసీలు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. వ్యాపార రంగంలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పరిధిలో చేస్తున్న చిరు వ్యాపారాలు, ప్రకృతి వ్యవసాయం, రుణాల చేయూత తదితర వాటిపై ఆయా శాఖల జిల్లా అధికారులు క్లుప్తంగా తెలియజేశారు. నంద్యాల జిల్లాలో 700 మందిని గుర్తించి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇప్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లీడ్ జిల్లా అధికారి సత్యనారాయణ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులు, ఎస్‌బీఐ ఆర్ఎం, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా బ్యాంక్ లింకేజీ కో–ఆర్డినేటర్ ఎల్లయ్య, డీపీఎం దానం, ఏపీఎం ఎ.ఎన్ ప్రసాద్, 29మండలాల ఏపీఎంల, సీసీలు హాజరయ్యారు.

సంక్షేమ పథకాలతోనే పేదల ఆర్థికాభివృద్ధి



పొన్నకల్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సుధాకర్ సూచించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని పొన్నకల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు పూలమాల వేసి, మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానికంగా నెలకొన్న తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, పథకాల అమల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలకు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల అప్పగింతలో 50 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు గుర్తుచేశారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు సచివాలయానికి మంజూరైన నిధుల ద్వారా పరిష్కారం చూపుతానని, అవసరమైతే ఎమ్మెల్యే నిధులను కూడా మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు దామోదర్ రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, నరసింహారెడ్డి, ఏలియా, రాముడు, హనుమంతు, గౌరన్న, కొండయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం రేమట గ్రామంలో ఎస్సీలకు శ్మశాన వాటికకు స్థలం, మైనారిటీల ఖబరస్థాన్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.15.25 లక్షల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేమట గ్రామంలో గ్రామంలో 250 ఎస్సీ కుటుంబాలు ఉండగా, శ్మశాన వాటిక స్థలం కేవలం రెండు సెంట్లు మాత్రమే ఉండడంతో అంత్యక్రియలు చేయడంతో తీవ్ర ఇబ్బంది నెలకొందని వివరించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఖబరస్థాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అలాగే సి బెళగల్‌లో ఎస్సీలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు.

నగర అభివృద్ధే ధ్యేయం



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: కర్నూలు నగర అభివృద్ధే ధ్యేయంగా కష్టపడి పనిచేస్తున్నామని మేయర్, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు మదర్‌ల్యాండ్‌లో రూ.50 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర పాలకవర్గం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కర్నూలును ఆదర్శంగా నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని, నగర రహదారుల విస్తరణ, పార్కులను నిర్మించడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొందన్నారు. గత రెండేళ్లలో రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పూర్తయ్యిందని వచ్చే వారం ప్రారంభిస్తామన్నారు.

కల్లూరులో పురోగతి

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో కల్లూరు అర్బన్ ప్రాంతం ఎంతో పురోగతి సాధించిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కరించామన్నారు. 16 వార్డుల్లో రూ.31.34 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. జగన్నాథ గట్టు మీద 50 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, అలాగే నగరంలో 21 తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.115 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులు పూర్తయితే కల్లూరుతో పాటు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, శివరాం స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి ముడుమాలలో..

సి.బెళగల్: మండలంలోని ముడుమాల గ్రామ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో ఉదయం 7:30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

నేడు వలంటీర్లకు వందనం సభ

గూడూరు: మండలంలో శనివారం గ్రామ వలంటీర్లకు వందనం సభ నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ పరిధిలోని వలంటీర్లు హాజరు కావాలని, అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొని వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తారని ఆమె పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఆమె కోరారు.

బాబుకు గుణపాఠం తప్పదు



నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్ దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయంగా సమాధి కడతామని వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివ, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు దళితలపై చేసిన అనుచిత వాఖ్యలపై నిరసనగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి నంద్యాల చెక్‌పోస్టులోని దమోదరం సంజీవయ్య సర్కిల్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. సెంటు స్థలంలో మీ సమాధులు కట్టుకుంటారా అని పేదలను హేళనగా మాట్లాడడం దారుణమన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు తీర్పు టీడీపీకి చెంపపెట్టు లాంటిదన్నారు. గతంలో ఎన్నోసార్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలను చంద్రబాబు దారుణంగా అవమానించిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి, విక్రమసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు హనుమంతురెడ్డి, శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, యూనస్ బాష, బీమశంకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

ఓర్వకల్లు: కామ్రేడ్ పుచ్చలపల్లె సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని శకునాల వద్ద జరుగుతున్న ఉపాధి పనులను వారు పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేసిన ఉద్యమాలు, పోరాటాలు, సాధించిన విజయాలను కూలీలకు వివరించారు. వ్య.కా.స మండలాధ్యక్షుడు చాంద్‌బాష, నాయకులు మనోహర్, పరశురాముడు, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలి

గూడూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై ఉపాధి హామీ పథకం కూలీలు ఐక్యంగా పోరాడాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మోహన్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం పెంచికలపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఉపాధి పథకాన్ని దశల వారీగా రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. కేంద్రం చర్యలకు నిరసనగా ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాకు వేలాది మంది కూలీలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.